TELUGU NEWS TIMES

# తెలుగు న్యూస్ టైమ్స్

జాతీయ దిన పత్రిక




సంపుటి : 3 | సంచిక : 320 | ఆదివారం 16 మార్చి 2025 | పేజీలు : 4 | వెల రూ. 3 | ఎడిటర్ : సిహెచ్. ముకుంద రావు | 9043514736, 9840467131 | online E-paper



## రూ.45,661 కోట్ల అంచనాలతో తమిళనాడు వ్యవసాయ బడ్జెట్

**విల్లివాకం న్యూస్:** ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఎక్స్ సైట్ పేజీ పోస్ట్‌లో ఇలా ఉంది. మన రైతుల జీవితాలను మెరుగుపరచడానికి తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని ముఖ్యమంత్రి తెలిపారు.

వ్యవసాయ కూలీలకు సంక్షేమ భృతి పెంపు, ముఖ్యమంత్రి 1,000 రైతు సంక్షేమ సేవా కేంద్రాలు, కొత్త సాంకేతికతలు,చిన్న మరియు సన్నకారు రైతుల సంక్షేమం, కొండ రైతుల అభివృద్ధి పథకం, డెల్టాయేతర జిల్లా వరి రైతులకు ప్రత్యేక ప్యాకేజీ పథకం, వ్యవసాయ ఉత్పత్తుల విలువ జోడింపు యూనిట్ల ఏర్పాటుకు నిధులు, వివిధ ప్రాజెక్టులతోపాటు రూ.45,661 కోట్ల అంచనాలతో తమిళనాడు వ్యవసాయ బడ్జెట్ శనివారం విడుదలైంది. మంత్రి ఎంఆర్‌కె పన్నీర్‌సెల్వం మరియు వ్యవసాయ శాఖ - రైతు సంక్షేమ అధికారులందరికీ అభినందనలు! అని అన్నారు.

## చెన్నైలో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి : స్టాలిన్



**విల్లివాకం న్యూస్:** చెన్నైలోని హైకోర్టులో జరిగిన మద్రాస్ బార్ అసోసియేషన్ 160వ వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎంఎం సుందరేష్, కేవీ విశ్వనాథన్, ఆర్.మహదేవన్, చెన్నై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కేఆర్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంకే స్టాలిన్ మాట్లాడుతూ.. చెన్నై హైకోర్టుకు భారతదేశంలోనే అత్యుత్తమ సంప్రదాయం ఉంది. న్యాయవ్యవస్థను నిలబెట్టడంలో న్యాయవాదుల పాత్ర ముఖ్యమైనది. రాజ్యాంగ పరిరక్షణలో మద్రాసు హైకోర్టు విశేష కృషి చేస్తోంది. చెన్నైలో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి. దక్షిణాది రాష్ట్రాల న్యాయవాదులకు ఇది ఉపయోగపడుతుందని అన్నారు.

## వ్యవసాయ బడ్జెట్ కేవలం కాగితపు కుప్ప మాత్రమే

**అన్నానగర్ న్యూస్:** శుక్రవారం తమిళనాడు అసెంబ్లీలో సాధారణ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. దీని తరువాత, రైతు సంక్షేమ మంత్రి ఎం.ఆర్.కె. పన్నీర్ సెల్వం నిన్న వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ పరిస్థితిలో, తమిళనాడు బిజెపి వ్యవసాయ బడ్జెట్ కేవలం కాగితపు కుప్ప అని బిజెపి నాయకుడు అన్నామలైని విమర్శించారు. ఈ విషయంలో, అతను X సైట్‌లోని తన పోస్ట్‌లో......

వ్యవసాయం పేరుతో డీఎంకే తప్పుదారి పట్టించే బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. డీఎంకే బడ్జెట్ అంతా అబద్ధాలు, వక్రీకరణలు. ఈ అబద్ధాలను బహిరంగ ప్రదేశాల్లో ప్రసారం చేస్తే, ప్రజలు వచ్చి చూస్తారని వారికి ఎవరు చెప్పారో నాకు తెలియదు. రెండు రోజులుగా, ప్రజల పన్నుల డబ్బు వృధా కావడమే మిగిలి ఉంది.గత సంవత్సరం విడుదల చేసిన వ్యవసాయ బడ్జెట్‌లో, 2022-2023లో తమిళనాడులో మొత్తం సాగు విస్తీర్ణం 155 లక్షల ఎకరాలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ సంవత్సరం బడ్జెట్‌లో అది 151 లక్షల ఎకరాలు అని చెప్పబడింది. నిజం చెప్పాలంటే గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం సాగు విస్తీర్ణం 4 లక్షల ఎకరాలు తగ్గింది. కానీ, దానిని దాచడానికి, ఈ సంవత్సరం సాగు విస్తీర్ణం నాలుగు సంవత్సరాల క్రితం 2019-2020 పంట విస్తీర్ణం కంటే ఎక్కువగా ఉందని వారు పేర్కొన్నారు. ఎందుకు? తమిళ నాడు ప్రజలు అంత తెలివితక్కువవారు అని



డీఎంకే భావిస్తుందా?

గత ఫిబ్రవరిలో పంట రుణాలు పూర్తిగా మాఫీ కాలేదని మేము చెప్పినప్పుడు, సహకార మంత్రి పెరియకరుప్పన్ వచ్చి అంబులిమామా కథలు చెప్పాడు. నేటి వ్యవసాయ బడ్జెట్‌లో, రూ.1,774 కోట్ల పంట రుణాలు ఇంకా మాఫీ కాలేదని స్పష్టంగా పేర్కొన్నారు. డీఎంకే అబద్ధాలు, వక్రీకరణలతో కాలం గడుపుతోంది. ఇంత సిగ్గులేకుండా అబద్ధాలు చెప్పడానికి డిఎంకె మంత్రులకు సిగ్గు లేదా? వరికి రూ. 2,500, చెరకుకు రూ. 4,000 కనీస మద్దతు ధర హామీ కేవలం మాటలకే పరిమితమైంది. రైతులను మోసం చేస్తూనే ఉండటమే డీఎంకే పని. ఈ ప్రభుత్వ వ్యవసాయ బడ్జెట్ కేవలం కాగితపు కుప్ప లాంటిదన్నారు.

# హిందీపై పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు

**అన్నా నగర్ న్యూస్ :** జనసేన పార్టీ 12వ వార్షికోత్సవ వేడుకలు పిఠాపురంలో జరిగాయి.ఈ సందర్భంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, "భారతదేశానికి కేవలం రెండు భాషలు మాత్రమే కాదు, తమిళం సహా అనేక భాషలు అవసరం. దేశ సమగ్రతకే కాకుండా, ప్రజల్లో ప్రేమ, ఐక్యత పెంపొందించేందుకు భాషా వైవిధ్యం స్వీకరించాలి" అని వ్యాఖ్యానించారు.

అయితే, తమిళనాడు సహా కొన్ని రాష్ట్రాల్లో హిందీ వ్యతిరేకత పెరగడాన్ని ఆయన ప్రస్తావిస్తూ, "తమిళనాడు రాజకీయ నాయకులు హిందీని వ్యతిరేకిస్తూనే, తమ సినిమాలను హిందీలో డబ్ చేయించేందుకు ఎందుకు అనుమతిస్తున్నారు? బాలీవుడ్ నుంచి డబ్బు తీసుకోవాలనుకుంటున్నారు కానీ హిందీని అంగీకరించరు. ఇది ఏ రకమైన తర్కం?" అని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### డీఎంకే ఎంపీ కనిమొళి కౌంటర్



ఈ నేపథ్యంలో, డీఎంకే ఎంపీ కనిమొళి ఆయన వ్యాఖ్యలను ఖండించారు. తన X (మాజీ ట్విట్టర్) ఖాతాలో ఆమె స్పందిస్తూ, పవన్ కళ్యాణ్ గతంలో "గో బ్యాక్ హిందీ" అన్న ప్రకటనను గుర్తు చేశారు. 2017లో పవన్ "ఉత్తరాది రాష్ట్రాల నాయకులు భారత సాంస్కృతిక వైవిధ్యాన్ని అర్థం చేసుకోవాలి" అని చెప్పిన విషయాన్ని ఆమె ప్రస్తావించారు.

## ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**విల్లివాకం న్యూస్:** జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు చెన్నైలో శుక్రవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని తమిళనాడు జనసేన నాయకుడు తమ్మయ్య నాయుడు నిర్వహించారు. ఈ వేడుకకు ప్రముఖ సినీ నిర్మాత ఏఎం రత్నం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే, టాలీవుడ్ నటుడు సప్తగిరి కూడా ప్రత్యేక అతిథిగా ఈ వేడుకలో పాల్గొన్నారు. జనసేన పార్టీ అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చెన్నై నలుమూలల నుండి వచ్చి ఈ వేడుకను విజయవంతం చేశారు. కార్యక్రమం ఆనందంగా, ఉత్సాహంగా సాగింది. నేతలు, కార్యకర్తలు పార్టీ భవిష్యత్తు గురించి చర్చించుకున్నారు. ఈ కార్యక్రమం జనసేన పార్టీకి తమిళనాడులో ఉన్న మద్దతును మరోసారి చాటిచెప్పింది. జనసేన సిద్ధాంతాలు, ప్రజా సమస్యలపై పోరాటం, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై నాయకులు మాట్లాడారు. కార్యక్రమం ఘనవిజయం సాధించడంతో తమ్మయ్య నాయుడు ముఖ్య అతిథులు, పార్టీ అభిమానులకు ధన్యవాదాలు తెలియజేశారు. నారాయణ బాబు మల్లారెడ్డి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.




## 23న వేద విజ్ఞాన వేదిక కార్యక్రమం

**విల్లివాకం న్యూస్:** వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహిక 159వ ప్రసంగ కార్యక్రమం ఈనెల 23వ తేదీ సాయంత్రం 6:30 గంటలకు టి.నగర్ విజయ రాఘవ రోడ్డులో గల ఆంధ్రా క్లబ్, కృష్ణా హాలు వేదికగా జరగనుంది. ఇందులో 'పానుగంటి వారి విశ్వరూపం - సాక్షి' అనే అంశంపై వక్త రాజమండ్రికి చెందిన విశ్రాంతాచార్యులు డాక్టర్ శ్రీవెంకటేశ్వరరావు ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమానికి సాహిత్యభిమానులందరినీ ఆహ్వానిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు జెకె రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు ఒక ప్రకటనలో తెలిపారు.





# సేవే పరమావధిగా..

తెలుగు భాషాభిమాని, సాంఘిక సేవాభిలాషి కనపర్తి మాలకొండయ్య (కేఎం కొండయ్య) మాతృభాషకు విశేష సేవలందించడమే కాకుండా, పేద విద్యార్థులకు ఇతోధిక సహాయాలు అందజేస్తున్నారు. సదరన్ రైల్వే చెన్నై డివిజన్ చీఫ్ టికెట్ ఇన్ స్పెక్టర్ గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందారు. సంగీతంపై ఆయనకున్న మక్కువతో డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం కల్చరల్ ట్రస్ట్ ఏర్పాటుచేసి ఔత్సాహిక గాయనీ గాయకులకు ప్రోత్సాహాన్నిస్తున్నారు. 'తెలుగు న్యూస్ టైమ్స్'తో ఆయన జీవిత విశేషాలను పంచుకున్నారు.





విల్లివాకం న్యూస్: కనపర్తి పెద్ద అంకయ్య, నరసమ్మ దంపతులకు ఆంధ్ర కనిగిరి సమీపానగల బాలిరెడ్డిపాలెం నా స్వస్థలం. ముగ్గురు అన్నదమ్ములలో నేను పెద్దవాడిని. చెన్నైలోనే పుట్టి పెరిగినా విద్యాభ్యాసం అంతా తెలుగులోనే సాగింది. పెరంబూరులో గల డిఆర్ బిసిసిసి హయ్యర్ సెకండరీ స్కూల్లో పదవ తరగతి చదువుతుండగా వ్యాసరచన పోటీల్లో మహాత్మా గాంధీ జీవిత చరిత్ర పుస్తకాన్ని బహుమతిగా అందుకున్నాను. 1985లో ప్రమీల దేవితో వివాహం జరిగింది. కుమార్తెలు పవిత్ర, సుమిత్ర, సుచిత్ర. పిల్లలందరికీ వివాహాలయి స్థిరపడ్డారు.



ప్రస్తుతం చెన్నై పులియాంతోపు, తిరువిక నగర్ లో నివాసం ఉంటున్నాము. ఉద్యోగ వివరాలకు వస్తే.. 1978లో ఆర్ఎస్ సి పరీక్షలో ఉత్తీర్ణత సాధించి విల్లుపురం స్టేషన్లో టిసి గా జాయిన్ అయ్యాను. అక్కడి నుంచి చెంగల్పట్టు, చెన్నై బీచ్ స్టేషన్లో పనిచేశాను. ఆ తర్వాత చెన్నై సెంట్రల్ లో చీఫ్ టికెట్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ పొందాను. తన సేవలకు గుర్తింపుగా 2002, 2015 సంవత్సరాలలో జరిగిన రైల్వే వారోత్సవాల్లో సిసిఎం అవార్డులు అందుకున్నాను. 2014 లో యూత్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ (యెవా)ను స్థాపించి వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఎల్ మాల్యాద్రి, ప్రధాన కార్యదర్శిగా నేను సేవలందించాము. ఎందరో విద్యార్థులకు విద్యా సహాయాలు అందజేశాము. 1985లో శ్రీవాణి కళా నికేతన్ ప్రారంభించి టీమ్ ఆర్గనైజర్గా వ్యవహరించాను. ఈ సంస్థ ద్వారా ఆర్ఆర్ సురేంద్ర దర్శకత్వం వహించిన 'సర్పయాగం' నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికయింది. పాటిబండ్ల విజయలక్ష్మి ద్వారా ప్రథమ బహుమతిగా నటరాజస్వామి కాంస్య విగ్రహం అందుకున్నాను. ఈ షీల్డ్ కు ఇప్పటికీ మా ఇంట్లో నిత్యం పూజలు చేస్తున్నాము. ఈ పోటీల్లో నేను రాసిన 'నా హృదయ వీణ' పాటకు ప్రథమ బహుమతి లభించింది. 2017 డిసెంబర్ 22వ తేదీ చెన్నైలో జరిగిన 'స్వరాభిషేకం' కార్యక్రమంలో గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం నుంచి మెమొంటో అందుకున్నాను. ఆయనపై అభిమానంతో 2022లో డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం కల్చరల్ అసోసియేషన్ ప్రారంభించాను. 2023లో దీనిని ట్రస్ట్ గా రిజిస్టర్ చేసాము. అధ్యక్షునిగా నేను, ప్రధాన కార్యదర్శిగా వైఎ విలియమ్, కోశాధికారిగా కె.బాలాజీ రావు కొనసాగుతున్నాము. ఈ ట్రస్ట్ తో భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించ తలపెట్టాము. గతంలో అత్తిపట్టు, ఒరగడం ప్రాంతాలలోని వృద్ధాశ్రమాలలో వృద్ధులకు వస్త్రాలు, భోజనాలు అందజేయడమే కాకుండా సంగీత విభావరులు ఏర్పాటు చేశాము. స్వర జ్ఞాని ఇళయరాజా విదేశాలలో సింఫనీ ప్రదర్శనలు ఇవ్వడం భారతదేశానికి గర్వకారణంగా భావిస్తున్నాను.



## బడ్జెట్ రైతులను సంతృప్తి పరచడానికి రూపొందించబడింది



**గిండి న్యూస్:** తమిళనాడు రైతులను సంతృప్తిపరిచే విధంగా వ్యవసాయ బడ్జెట్‌ను రూపొందించామని భారత కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ అన్నారు. ఈ విషయంలో ఆయన విడుదల చేసిన ప్రకటనలో... వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రి ఎం.ఆర్.కె. పన్నీర్ సెల్వం 15.03.2025 తమిళనాడు శాసనసభలో ఐదవసారి వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ వ్యవసాయ బడ్జెట్‌ను తయారు చేసే ముందు, ఆయన రైతులు మరియు రైతు సంఘాల ప్రతినిధులతో సంప్రదింపుల సమావేశాలు నిర్వహించి, వారి డిమాండ్లు మరియు సూచనలను కోరారు. ఈ ప్రజాస్వామ్య లక్షణం స్వాగతించదగినది. ఇది కొనసాగాలి.గత సంవత్సరం (2024-25) 1.81 లక్షల నీటిపారుదల బావులకు విద్యుత్ కనెక్షన్లు వచ్చాయని, వెంటనే అనుసంధానం చేయలేని 1,000 వ్యవసాయ బావులకు సోలార్ విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేయడానికి నిధులు కేటాయించామని నివేదిక పేర్కొంది. చిన్న ధాన్యాల ఉద్యమం మరియు నూనెగింజల ఉద్యమంతో పాటు జీడిపప్పు బోర్డు ఏర్పాటు, వర్షాధార ప్రాంతాలలో వేసవిలో పంట సాగు కోసం హెక్టారుకు రూ. 2,000 సబ్సిడీ అందించడం, వ్యవసాయ చెరువులను ఏర్పాటు చేయడం వంటి వివిధ పథకాలు వ్యవసాయ ఉత్పత్తిని పెంచడానికి సహాయపడతాయి. ఆహార ఉత్పత్తులను అవి పండించే పొలాల నుండి వినియోగదారుల ఇళ్లకు రవాణా చేయడానికి రైతు బజార్ ప్రారంభించబడింది. దీన్ని మరింత విస్తరించడానికి, వినియోగదారుల గృహాలకు ఆన్‌లైన్ ఆర్డరింగ్ అందించే కొత్త కార్యక్రమం రైతుల మార్కెట్ వ్యాపారాన్ని బలోపేతం చేస్తుంది.వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ పేరుతో ఈ పరిశోధన ప్రాజెక్ట్ సముచితం. సాగు పనుల యాంత్రీకరణ అభివృద్ధిని పరిగణనలోకి తీసుకోవడం, వ్యవసాయ పనుల కోసం యాంత్రీకరణ కేంద్రాల ఏర్పాటు. యంత్రాల కొనుగోలుకు సబ్సిడీలు అందించడం, వేలాది కేంద్రాల్లో ముఖ్యమంత్రి రైతు సంక్షేమ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్ల సాగు పనులు సజావుగా సాగుతాయనీ పేర్కొన్నారు.

## చెన్నైలోని వలసరవక్కంలో దోపిడీ ప్రయత్నంబీ మహిళా డాక్టర్‌పై కత్తితో దాడి




**అన్నానగర్ న్యూస్:** చెన్నై వలసరవక్కంలోని బృందావనం నగర్ ప్రాంతంలో ఒక మహిళా వైద్యురాలు తన కుటుంబంతో కలిసి నివసిస్తుంది. ఒక మర్మమైన వ్యక్తి ఆమె ఇంటికి వచ్చి, ఆన్‌లైన్‌లో మందులు ఆర్డర్ చేశారని, వాటిని డెలివరీ చేయడానికి వచ్చానని చెప్పాడు.ఆ మహిళా వైద్యురాలు, తన కుటుంబంలో ఎవరో ఆ మందు ఆర్డర్ చేశారని భావించి, ఆ వ్యక్తిని తనకు ఆ మందు ఇవ్వమని అడిగింది. ఆ తర్వాత ఆ వ్యక్తి తన బ్యాగులో దాచుకున్న కత్తిని తీసి, మహిళా వైద్యురాలిని పొడిచి, ఇంట్లోని వస్తువులను దోచుకునేందుకు ప్రయత్నించాడు.ఆ శబ్దం వినీ పొరుగువారు వచ్చేసరికి భయపడి అక్కడి నుంచి పారిపోయాడు. గాయపడిన మహిళా వైద్యురాలిని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించగా, ఈ సంఘటన గురించి సమాచారం అందుకున్న పోలీసులు దోపిడీకి ప్రయత్నించిన వ్యక్తిని విచారించారు.ఈ దర్యాప్తు ఆధారంగా, పోలీసులు రామపురం ప్రాంతానికి చెందిన నాగముత్తు అనే 41 ఏళ్ల వ్యక్తిని అరెస్టు చేశారు.




## రూ.90,000 దాటిన బంగారం



ఇటీవల అంతర్జాతీయంగా, దేశీయంగా కాస్త నెమ్మదించిన పసిడి ధరలు గురువారం ఒక్కసారిగా భగ్గుమన్నాయి. హైదరాబాద్ బులియన్ విపణిలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర తొలిసారిగా రూ.90,000 మించింది. కిలో వెండి ధర కూడా రూ.1.03 లక్షలకు చేరింది. అంతర్జాతీయంగా ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వివిధ దేశాల ఉత్పత్తులపై విధిస్తున్న సుంకాలు, ఇంకా పలు దేశాల ఉత్పత్తులపై సుంకాలు పెంచుతామనే హెచ్చరి కల నేపథ్యంలో.. వాణిజ్య ఉద్రిక్తతలు పెరిగి అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి ఏర్పడుతోంది. అమెరికాలోనూ ఆర్థిక మందగమనం ఏర్పడుతుందనే ఆందోళనలు చుట్టుముడుతున్న పరిస్థితుల్లో, సురక్షితమని భావించే బంగారంపైకి పెట్టుబడులు మళ్లడం.. ధరలు ఒక్కసారిగా పెరిగేందుకు కారణమయ్యాయి. ఔన్సు (31.10 గ్రాముల) మేలిమి బంగారం ధర అంతర్జాతీయ విపణిలో 2983 డాలర్లకు చేరడంతో, దేశీయ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.90,450కి చేరింది. కిలో వెండి ధర రూ.1,03,000 వద్ద కదలాడుతోంది.



## చిరంజీవికి మరో అరుదైన గౌరవం

**హైదరాబాద్:** అగ్ర కథానాయకుడు చిరంజీవికి మరో అరుదైన గౌరవం దక్కింది. నాలుగు దశాబ్దాలకు పైగా సినీ రంగానికి ఆయన అందిస్తోన్న విశేష సేవలను యూకే ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు చిరంజీవికి జీవిత సాఫల్య పురస్కారం అందించాలని యూకే పార్లమెంట్ నిర్ణయించింది. మార్చి 19న చిరంజీవి ఈ అరుదైన గౌరవాన్ని అందుకోనున్నారు. 'పునాదిరాళ్ళు'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు చిరంజీవి. కెరీర్ ఆరంభంలో ఎన్నో సవాళ్లు, అవమానాలు ఎదుర్కొని స్టార్ హీరోగా ఎదిగారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ తనదైన నటన, డ్యాన్సులతో యువతను ఉర్రూతలూగించారు. బాక్సాఫీస్ రికార్డులు క్రియేట్ చేశారు. 9 ఫిలింఫేర్, 3 నంది అవార్డులతోపాటు ఎన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్నారు. సినీ రంగానికి ఆయన చేస్తున్న సేవలు గుర్తించిన ప్రభుత్వం 2006లో ఆయనకు పద్మభూషణ్, 2024లో పద్మవిభూషణ్ అందించి గౌరవించింది. ఇటీవల గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో ఆయన చోటు దక్కించుకున్నారు. 156 చిత్రాలు.. 537 పాటలు.. 24 వేల స్టెప్పులతో అలరించినందుకు ఈ రికార్డు దక్కింది.




## మార్చి 24-25న యథావిధిగా బ్యాంకుల సమ్మె



బ్యాంకు ఉద్యోగులు తమ డిమాండ్లు నెరవేర్చాలని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్స్‌తో జరిగిన చర్చలు విఫలమయ్యాయని బ్యాంకు యూనియన్లు తెలిపాయి. దీంతో ప్రణాళిక ప్రకారం మార్చి 24- 25 తేదీల్లో యథావిధిగా సమ్మె జరుగుతుందని స్పష్టం చేశాయి. ఐబీఏతో జరిగిన సమావేశంలో అన్ని కేడర్లలో నియామకాలు, ఐదు రోజుల పని దినాలు వంటి సమస్యల్ని యూఎఫ్‌బీయూ సభ్యులు లేవనెత్తారు. వీటిపై జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో ఈ సమస్యలపై ఎటువంటి పరిష్కారం లభించలేదని నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ జనరల్ సెక్రటరీ ఎల్.చంద్రశేఖర్ అన్నారు. అందుకే ముందు ప్రకటించినట్లుగానే రెండు రోజుల పాటు సమ్మె ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వర్క్‌మెన్, ఆఫీసర్ డైరెక్టర్ పోస్టుల్ని భర్తీ చేయడం వంటి డిమాండ్లతో యూఎఫ్‌బీయూ తొలుత సమ్మెను ప్రకటించింది. ఉద్యోగుల పనితీరుపై సమీక్షలు, పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలకు సంబంధించి ఇటీవల జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని కూడా ఈ యూనియన్లు కోరుతున్నాయి. ఇటువంటి చర్యలు ఉద్యోగ భద్రతకు ముప్పు కలిగిస్తాయని ఆరోపిస్తున్నాయి. యూఎఫ్‌బీయూలో ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్, ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్, నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్, ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ వంటి ప్రధాన బ్యాంకు సంఘాలు ఉన్నాయి.

- సమూల మార్పులకు సిద్ధమవుతున్న ప్రభుత్వం
- ఏప్రిల్ నుంచే తరగతుల నిర్వహణకు సన్నాహాలు



# ఇంటర్ విద్యలో సంస్కరణలు



## సమూల మార్పులు

**అమరావతి:** ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. కొంత కాలంగా జరుగు తున్న కసరత్తు మేరకు తాజాగా ఇంటర్మీడియట్ విద్యలో పలు కీలక మార్పులు తీసుకురావాలని నిర్ణయిం చింది. ఏప్రిల్ నుంచే అడ్మిషన్లు ప్రారంభించాలని నిర్ణయించారు. దీంతో 2025-26 విద్య సంవత్సరం నుంచి జూన్ 1వ తేదికి బదులుగా ఏప్రిల్ 1వ తేదీ నుంచే ప్రభుత్వ కళాశాలలు ప్రారంభం కానున్నాయి. 2026లో పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరిలో, ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు ఏప్రిల్ 7వ తేదీ నుంచి ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు.

ఇంటర్మీడియట్ విద్యా విధానంలో మార్పులు తీసుకొచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇటీవల జరిగిన సమీక్షలో ఈ మేరకు పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. అందులో భాగంగా.. ఇంటర్మీడియట్‌లో ఇక నుంచి విద్యార్థులు ఎం.బైపీసీ చదువుకునే అవకాశాన్ని కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గణితంలో ఏ,బీ పేపర్లు రద్దు చేసి ఇకపై వంద మార్కులకు ఒకటే పరీక్ష నిర్వహిస్తారు. సైన్స్ సబ్జెక్టుల్లో మార్కులను 60 నుంచి 85కు పెంచారు. ఏటా ఫిబ్రవరిలోనే పబ్లిక్ పరీక్షలు నిర్వహించేలా కీలక సంస్కరణలకు ఇంటర్మీడియట్ విద్యా మండలి ఆమోదం తెలిపింది. ఇంటర్మీడియట్‌లో ఇకపై ఎం.బైపీసీ గ్రూపు చదవడం వల్ల విద్యార్థులు మెడికల్, ఇంజినీరింగ్ రెండింటికీ అర్హత సాధిస్తారు. నీట్, జేఈఈలు రాసుకోవచ్చు.

- ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు రద్దు చేయాలని గతంలో వచ్చిన ప్రతిపాదనను ఇంటర్మీడియట్ విద్యామండలి నిలిపివేసింది.
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రథమ సంవత్సరంలో జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి సిలబస్‌ను అమలు చేయనున్నారు.
- విద్యార్థులు ఆరు సబ్జెక్టులతో ఎం.బైపీసీ కోర్సు చదువుకునే అవకాశం కల్పించారు.
- మార్చిన సిలబస్ ప్రకారం కొత్త పాఠ్యపుస్తకాలను ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచితంగా ఇస్తారు. గ్రూపులో ఐదు సబ్జెక్టులు ఉంటాయి. రెండు భాష సబ్జెక్టుల్లో ఆంగ్లం తప్పని సరిగా చదవాల్సి ఉంటుంది. రెండో భాష సబ్జెక్టు ఐచ్ఛికంగా ఎంపిక చేసుకోవచ్చు. అదే విధంగా ఎంపీసీ విద్యార్థి రెండో భాష తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ స్థానంలో జీవశాస్త్రం తీసుకుంటే ఎం.బైపీసీ చదవొచ్చు. లేదంటే నచ్చిన సబ్జెక్టును ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు.

**ముందే తరగతులు..** 2025-26 విద్యా సంవత్సరం నుంచి జూన్ ఒకటో తేదీకి బదులు ఏప్రిల్ 1 నుంచే జూనియర్ కళాశాలలు ప్రారంభమవుతాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల ప్రక్రియ ఏప్రిల్ 7నుంచి మొదలవుతాయి. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 2026లో కాకుండా ఫిబ్రవరి చివరి వారం నుంచే నిర్వహిస్తారు. వృత్తి విద్యా కోర్సుల్లో డ్యూయల్ సర్టిఫికెట్ విధానం ఉంటుంది. ఒకటి జాతీయ నైపుణ్య కౌన్సిల్ సర్టిఫికెట్‌తోపాటు ఇంటర్మీడియట్ బోర్డు మరో సర్టిఫికెట్ ఇస్తుంది. దీంతో పాటుగా 1973 నుంచి 2003 వరకు ఉన్న సర్టిఫికెట్లను డిజిటలైజేషన్ చేయాలని తాజా సమీక్ష లో నిర్ణయం తీసుకున్నారు.

**100 మార్కులకే పేపర్..** ఇంటర్ విద్యార్థులకు ప్రస్తుతం గణితంలో ఏ, బీగా పేపర్లు 150 మార్కులకు ఉండగా వచ్చే ఏడాది మొదటి సంవత్సరం విద్యార్థులకు 100 మార్కులకే పేపర్ ఉంటుంది. భౌతిక, రసాయనశాస్త్రాలు ప్రస్తుతం 60 మార్కులకు ఉండగా ఇది 85 మార్కులకు పెరగను న్నాయి. రెండో ఏడాదిలో 30మార్కులకు ప్రాక్టికల్స్ ఉంటాయి. వృక్ష, జంతు శాస్త్రం కలిపి జీవశాస్త్రంగా ఒకే సబ్జెక్టుగా ఉంటాయి. ఇది 85 మార్కులకు ఉంటుంది. ఇందులో 43 మార్కులు వృక్షశాస్త్రం, 42 మార్కులు జంతుశాస్త్రం ఉంటుంది. మిగతా 15 మార్కులకు ప్రాక్టికల్స్ ఉంటాయి. భాష సబ్జెక్టులు వంద మార్కులకు ఉంటాయి. నీట్, జేఈఈ, ఈఏపీసెట్ లాంటి పోటీ పరీక్షల మెటీరియల్‌ను బోర్డు పోర్టల్‌లో ఉంచుతారు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు కోచింగ్ తోపాటు మెటీరియల్ ఉచితంగా ఇస్తారు.

# అమెరికాలో పెను తుపాను.. 16 మంది మృతి



అమెరికాను పెను తుపాను వణికిస్తోంది! పెద్దఎత్తున టోర్నడోలు విరుచుకుపడుతున్నాయి. దుమ్ముధూళితో కూడిన బలమైన గాలులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆయా రాష్ట్రాల్లో 100కుపైగా కార్చిచ్చులు చెలరేగాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఒక్క మిస్సోరీలోనే ఇప్పటివరకు పది మంది మృతి చెందారు. టెక్సాస్ పాన్‌హ్యాండిల్‌లోని అమరిల్లో కౌంటీలో మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఆర్కన్సాస్‌లోనూ ముగ్గురు చనిపోగా.. 29 మందికి గాయాలయ్యాయి. మిస్సోరీలో టోర్నడోలు బెంబలెత్తిస్తున్నాయి. దీంతో స్థానికంగా పలు భవనాలు దెబ్బతిన్నాయి. అలబామా, కెంటకీ, మిసిసిపీ, టెనసీ, ఇల్లినోయీ, ఇండియానా, టెక్సాస్, టెన్నెసీ రాష్ట్రాలకూ టోర్నడోల ముప్పు పొంచి ఉందని జాతీయ వాతావరణ సేవల విభాగం ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. కెనడా సరిహద్దు నుంచి టెక్సాస్ వరకు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని అంచనా. ఓక్లహోమా, మిస్సోరీ, న్యూ మెక్సికో, టెక్సాస్, కాన్సస్‌లలో కార్చిచ్చులు చెలరేగడంతో ఆయా ప్రాంతాల నుంచి ఖాళీ చేయాలని నివాసితులను ఆదేశించింది. మరోవైపు.. మిన్నెసోటా, సౌత్ డకోటాలోని కొన్ని ప్రాంతాలకు మంచు తుపాను ముప్పు పొంచి ఉందని వాతావరణ అధికారులు హెచ్చరించారు. మార్చిలో ఇలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు అసాధారణమేమీ కాదని, అయితే.. ఈసారి విస్తృతి, తీవ్రత అధికంగా ఉందని జాతీయ వాతావరణ సేవల విభాగం నిపుణుడు బిల్ బంటింగ్ చెప్పారు.

# మినరల్ ట్యాక్స్ ఎఫెక్ట్.. సిమెంట్ ధరలకు రెక్కలు?

సిమెంట్ కంపెనీల మధ్య పోటీ కారణంగా గత కొన్ని రోజులుగా స్తబ్దుగా ఉన్న ధరలు.. రాబోయే రోజుల్లో ప్రియం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఖనిజాలపై పన్ను విధించేందుకు సిద్ధమవుతుండడమే దీనికి కారణం. దీంతో సిమెంట్ ధరలకు రెక్కలు రాబోతున్నాయని ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ జేఎం ఫైనాన్షియల్ సంస్థ పేర్కొంది.

ఖనిజాలు, గనులు కలిగిన భూములపై రాయల్టీ విధించే హక్కు రాష్ట్రాలకు ఉందని గతేడాది సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఈనేపథ్యంలో తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం సిమెంట్ తయారీలో వినియోగించే సున్నపురాయి మైనింగ్‌పై టన్నుకు రూ.160 చొప్పున వసూలుచేయాలని నిర్ణయించింది. ఫిబ్రవరి 20 నుంచి ఈ కొత్త పన్ను అమల్లోకి రానుంది. కర్ణాటక కూడా ఇదేతరహా నిర్ణయం తీసుకోవాలని చూస్తోంది. మిగిలిన రాష్ట్రాలు ఇలాగే ఆలోచన చేయొచ్చని జేఎం ఫైనాన్షియల్ చెబుతోంది. ఈ పన్ను వల్ల సిమెంట్ తయారీ వ్యయం కంపెనీలకు పెరుగుతుంది. దీంతో లాభదాయకత పెంచుకోవాలంటే సిమెంట్ కంపెనీలకు ధరల పెంపు చేపట్టక తప్పని పరిస్థితి నెలకొంటుంది. దీంతో ఒక్కో బ్యాగ్‌పై తమిళనాడులో రూ.8-10 మేర పెరిగే అవకాశం ఉందని జేఎం ఫైనాన్షియల్ పేర్కొంది. ఆ మేర ప్రజలపై భారం పడే అవకాశం ఉందని తెలిపింది. ఒకవేళ మిగిలిన రాష్ట్రాలూ ఇదేతరహా పన్ను తీసుకొస్తే.. దేశవ్యాప్తంగా సిమెంట్ ధరలు పెరిగే అవకాశం ఉంది.

ఖనిజాలు, గనులపై రాష్ట్రాలు రాయల్టీ విధించే విషయంలో హక్కు రాష్ట్రాలకు ఉందని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఈమేరకు 8:1తో విస్తృత ధర్మాసనం గతేడాది కీలక తీర్పు వెలువరించింది. ఖనిజాలు సమృద్ధిగా కలిగిన ఒడిశా, ఝార?ండ్, పశ్చిమ్‌బెంగాల్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు ఈ తీర్పు వల్ల ప్రయోజనం చేకూరనుంది. ఆ రాష్ట్రాలు తమ భూభాగంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలపై అదనంగా మొత్తాన్ని వసూలుచేసే వీలుంది. గనులు, ఖనిజాల నియంత్రణ, అభివృద్ధిపై పార్లమెంటుకు గంపగుత్త అధికారాన్ని రాజ్యాంగం కట్టబెట్టలేదని గత విచారణలో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది.

## అయితే రాజ్యసభకు వెళతా.. లేకపోతే విశ్రాంతి: యనమల

**అమరావతి:** భవిష్యత్తులో పార్టీ అవకాశమిస్తే రాజ్యసభకు వెళతానని, లేకపోతే విశ్రాంత జీవితం గడుపుతానని తెదేపా సీనియర్ నేత యనమల రామకృష్ణుడు తెలిపారు. శాసనమండలి సభ్యుడిగా ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న తనను.. ఆ తర్వాత ఏం చేస్తారని అడుగుతున్న సన్నిహితులు, శ్రేయోభిలాషులకు ఇదే సమాధానం చెబుతు న్నానని పేర్కొన్నారు. ఆయన శాసనసభ లాబీల్లో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు తెదేపా అభ్యర్థుల్ని ప్రకటించిన రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు తనతో ఫోన్‌లో మాట్లాడారని తెలిపారు.